క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలోని తాటిచెర్ల మోటు సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్‌ఎస్ నూతన లైన్లు ఏర్పాటు చేస్తున్నందున శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. తాటిచెర్ల, నాగిరెడ్డిపల్లె, హసనాపురం, ముత్రాసుపల్లె, దద్దవాడ, గుండ్రెడ్డిపల్లె, నారాయణపల్లె, అలసందలపల్లె, గోవిందపల్లె, పొట్టిపల్లె, అక్కపల్లె, వెంకటాంపల్లె, కంకరవానిపల్లె గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తున్నామని, ఆయా గ్రామాల ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

బాధ్యతలు చేపట్టిన ఎంఈఓ-1

అర్ధవీడు: మండల విద్యాశాఖ అధికారి-1గా ఇంకొల్లు సుజాత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలులోని బండ్లమిట్ట బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె ఇటీవల బదిలీల్లో భాగంగా అర్ధవీడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా, నియమితులయ్యారు. పదోన్నతిపై ఎంఈఓ-1గా బాధ్యతలు చేపట్టిన ఆమెను ఎంఈఓ-2 లక్ష్మీనాయక్, పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు అర్జునరావు, శేఖర్, వెంకట్, కంప్యూటర్ ఆపరేటర్ జి.కోటేశ్వరరావు, ఉపాధ్యాయుడు ఎం.చాంద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువ ఏర్పాటు



నూతనంగా ఏర్పాటు చేసిన డ్రైనేజీ

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడులో అంతర్గత సీసీ రోడ్డు మురికికూపంగా మారడంతో ఎంపీడీఓ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి రంగస్వామి చర్యలు తీసుకున్నారు. డ్రైనేజీ కాలువ లేకపోవడంతో వర్షం, గృహాల నుంచి వచ్చే మురికినీరు రోడ్డుపై చేరి నిల్వ ఉంటోంది. పరిస్థితిని గమనించిన ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు రోడ్డుకు ఒకవైపు డ్రైనేజీ ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో జేసీబీతో తాత్కాలికంగా కచ్చా డ్రైనేజీ తవ్వించారు.

ఎంఈఓలకు సమ్మె నోటీసు అందజేత



ఎంఈఓలకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

బేస్తవారిపేట: ఈనెల 9వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో తాము పాల్గొంటున్నామని మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓలు అబ్దుల్ సత్తార్, సీహెచ్ రమణారెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ గన్నెపూడి అబ్రహం, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకులు పాశ్వామియా, మంజువాణి, ఎలీసమ్మ పాల్గొన్నారు.


శాకంబరిగా జగదాంబ అమ్మవారు



శాకంబరిగా భక్తులకు దర్శనమిస్తున్న జగదాంబ అమ్మవారు

మార్కాపురం టౌన్: స్థానిక మార్కండేశ్వర స్వామి దేవస్థానంలో జగదాంబ అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. 9వరోజు శుక్రవారం అమ్మవారికి ఆలయ అర్చకులు ఆంజనేయ ప్రసాద్, వరుణ్‌తేజ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేపు శ్రీవారి ఆలయ వార్షికోత్సవం



ముస్తాబైన వెంకటేశ్వరస్వామి ఆలయం

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు అర్చకుడు విజయ్‌కాంత్‌శర్మ, నిర్వాహకులు పాతకోట శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ, సాయంత్రం స్వామివారి రథోత్సవం, కోలాట ప్రదర్శన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నకిలీ విత్తు.. రైతుకు విపత్తు!



వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో గోతికాడ నక్కల్లా కాచుక్కూర్చున్న నకిలీ కేటుగాళ్లు

- గత ఏడాది నకిలీ విత్తనాలతో గిద్దలూరు నియోజకవర్గంలో భారీగా నష్టపోయిన రైతులు
- లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే విత్తనాలు కొని రశీదులు, సంచులు భద్రపరచాలని వ్యవసాయాధికారుల సూచన
- వైఎస్సార్ సీపీ హయాంలో గిద్దలూరులో అందుబాటులోకి వచ్చిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్
- అవగాహన లేక సేవలు వినియోగించుకోలేకపోతున్న రైతులు

రైతుల కోసం అగ్రిటెస్ట్ ల్యాబ్

నకిలీ విత్తనాలు, పురుగు మందుల బారిన పడి రైతుల ఆర్థికంగా నష్టపోకూడదన్న ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అగ్రి టెస్ట్ ల్యాబ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానంగా ఉండే అగ్రి టెస్ట్ ల్యాబ్‌లో అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. ఈ క్రమంలో గిద్దలూరులో రూ.65 లక్షలతో అగ్రిటెస్ట్ ల్యాబ్ నిర్మించారు. యుద్ధప్రాతిపదికన సిబ్బందిని సైతం నియమించి సేవలను ప్రారంభించారు. ప్రతి సీజన్‌లో పంట సాగుకు ముందు రైతులు నేరుగా ల్యాబ్ వద్దకు వెళ్లి విత్తనాలను పరీక్ష చేయించుకునే అవకాశం కల్పించారు. అయితే దీనిపై రైతులకు అవగాహన లేక పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవడం లేదని తెలుస్తోంది.



గిద్దలూరులోని అగ్రిటెస్ట్ ల్యాబ్

బేస్తవారిపేట:

ఖరీఫ్ సీజన్ వచ్చింది. రైతులను ఆకర్షించేలా కొత్త కొత్తగా విత్తనాల కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో పంటలు సాగు చేసే రైతులు ముందుగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయడం సహజం. ఈ సమయంలో రైతుల అవగాహన లేమి, అమాయకత్వాన్ని అడ్డుపెట్టుకుని అనుమతులు లేని కంపెనీలు తమ ఆగ్రో ఉత్పత్తులను మార్కెట్‌లోకి చొప్పించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా మిర్చి, పత్తి, మొక్కజొన్న, అపరాలు, కూరగాయల విత్తనాలను గిద్దలూరు, బేస్తవారిపేట, కంభంలో కొనుగోలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు.

భారీగా నష్టపోయిన రైతులు

గత ఏడాది రబీ సీజన్‌లో అర్ధవీడు మండలంలోని చీమలేటిపల్లె, దొనకొండ, అర్ధవీడు, అంకభూపాలెం, పాపినేనిపల్లె, బొల్లుపల్లె, అచ్చంపేట, నాగులవరం, రంగాపురం, గన్నెపల్లె, కాకర్లలో విత్తనోత్పత్తి కోసం మొక్కజొన్న సాగు చేసేందుకు రైతులు అగ్రిమెంట్ చేసుకుని పంట సాగు చేశారు. సాగు సమయంలో 3 నుంచి 4 టన్నుల దిగుబడి వస్తుందని విత్తన కంపెనీ ఏజెంట్లు చెప్పిన మాటలను రైతులను గుడ్డిగా నమ్మారు. తీరా పంట చేతికొచ్చాక ఎకరాకు టన్ను దిగుబడి రాలేదు. అప్పటికే అప్రమత్తమైన రైతులు విత్తన కంపెనీ ప్రతినిధులను ప్రశ్నించగా పత్తా లేకుండ పోయారు. ఈ క్రమంలోనే రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. మొత్తం మీద ఆ కంపెనీ అంటగట్టిన విత్తనాలు సాగు చేసి రైతులు భారీగా నష్టపోయారు. బేస్తవారిపేట మండలంలోని పూసలపాడు, మోక్షగుండం, ఎంపీ చెరువు, ఖాజీపురం గ్రామాల్లోనూ నకిలీ మొక్కజొన్న విత్తనాలతో రైతన్నలు ఆర్థికంగా దెబ్బతిన్నారు. కొమరోలు మండలంలో సూరవారిపల్లె, బాదినేనిపల్లె, రెడ్డిచర్ల, అల్లీనగరం, చింతలపల్లె, పుల్లారెడ్డిపల్లె పంచాయతీల్లో దాదాపు 300 ఎకరాల్లో పప్పుశనగ పంట పూర్తిగా దిగుబడి తగ్గిపోయింది. నకిలీ విత్తనాలే అందుకు కారణమని గ్రహించిన రైతులు వ్యవసాయాధికారికి సైతం ఫిర్యాదు చేశారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

- వ్యవసాయశాఖ నుంచి లైసెన్స్ పొందిన కంపెనీ డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు వచ్చే బిల్లును పంటకాలం పూర్తయ్యేంత వరకు భద్రపరచుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనకూడదు. గడువు దాటిన విత్తనాల జోలికి వెళ్లవద్దు.
- కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్లు, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి.
- విక్రయదారుడు ఇచ్చే కరపత్రాలు తీసుకుని వాటిలో సూచించిన అంశాలను పరిశీలించాలి.
- బిల్లులపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకపు పన్ను నెంబర్, రైతు పేరు, గ్రామం పేరు, విక్రయదారుడి సంతకం, తేదీ, విత్తన రకం, బ్యాచ్ నెంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి.

రూ.5 లక్షలు నష్టపోయా



అర్ధవీడు మండలం నారాయణపల్లెకు చెందిన పోరెడ్డి రంగారెడ్డి 5 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. నకిలీ విత్తనాలతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఎకరాకు అరటన్ను దిగుబడి వచ్చింది. ఎకరాకు 3-4 టన్నుల దిగుబడి వస్తుందని చెప్పిన కంపెనీ ఏజెంట్లు ఆ తర్వాత అస్సలు పట్టించుకోలేదు. దాదాపు 5 లక్షల రూపాయలు నష్టపోయా.

– పోరెడ్డి రంగారెడ్డి, రైతు, నారాయణపలె

తగిన జాగ్రత్తలు అవసరం



విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. విత్తనాలకు సంబంధించి ఏదైనా అనుమానం వస్తే గిద్దలూరులోని అగ్రి ల్యాబ్‌లో నాణ్యతను పరిశీలించుకోవచ్చు. ఎక్కడపడితే అక్కడ విత్తనాలు కొనుగోలు చేస్తే మోసపోయేందుకు ఎక్కువ ఆస్కారం ఉంటుంది. లైసెన్స్ కలిగిన డీలర్ వద్దనే కొనుగోలు చేసి, బిల్లు తీసుకుని భద్రపరచుకోవాలి.

– షేక్ అబ్దుల్ రఫీక్, వ్యవసాయాధికారి, బేస్తవారిపేట

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డిపో ఆవరణలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు



మార్కాపురం డిపో వద్ద ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులు

గిద్దలూరు రూరల్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక డిపో ఆవరణలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు చక్రపాణియాదవ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులందరికీ పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు ఇవ్వాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీయే స్వయంగా కొనుగోలు చేయాలన్నారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 10 వేల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాలన్నారు, డబుల్ డ్యూటీలు చేసే సిబ్బందికి ఇచ్చే డీడీ అమౌంట్ పెంచాలని, రిటైరైన ఉద్యోగులకు గ్రాడ్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను తక్షణమే చెల్లించాలని, పెండింగ్ డీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు రెండు రోజులపాటుగా ఎర్ర బ్యాడ్జీలు ధరించి గేట్ మీటింగ్‌కు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బత్తుల తిరుపతయ్య, జాఫర్, షేక్.బాషా, కొండారెడ్డి, బీఎస్ రెడ్డి, నాయక్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మార్కాపురంలో ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

మార్కాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎస్‌వీఎస్ శాస్త్రి, సయ్యద్ బాషా హుస్సేన్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులందరికీ ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 10 వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ వెంటనే ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని కోరారు. ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జనార్దనరావు, శేఖర్‌నాయుడు, వెంకటేశ్వర్లు, నానీ, ఏడీసీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ మీట్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ అబ్దుల్ సత్తార్

కంభం: పాఠశాలల్లో ఈనెల 10వ తేదీ నిర్వహించనున్న మెగా పేరెంట్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ అబ్దుల్ సత్తార్ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల సమగ్ర అభివృద్ధి, అకడమిక్ అంశాలపై సూచనలిచ్చారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించేలా చూడాలని, మండలంలో డ్రాపౌట్స్ సంఖ్య తగ్గించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మొయినుద్దీన్, గని వెంకటేశ్వర్లు, కేశవరావు, వల్లభరావు, పులి నాగమణి, సీఆర్పీలు, ప్రధానోపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

యర్రగొండపాలెం: పునర్వ్యవస్థీకరణ వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకొని రైతులు ప్రయోజనం పొందాలని వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్ ఈవీ రమణ అన్నారు. శుక్రవారం మండలంలోని బోయలపల్లి సచివాలయంలో రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, వాటి విపత్తుల నుంచి వచ్చే నష్టాలపై ఆర్థిక రక్షణ కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పత్తి పంటకు రైతులు రూ.2100 ప్రీమియం చెల్లిస్తే విపత్తుల కారణంగా నష్టపోయిన రైతుకు రూ.42 వేల వరకు చెల్లిస్తారని పేర్కొన్నారు.

విత్తనాల బిల్లులివ్వడం తప్పనిసరి

- డీలర్లకు జేడీఏ శ్రీనివాసరావు సూచన



ఏఓ శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న జేడీఏ శ్రీనివాసరావు, ఏడీఏ నాయక్ తదితరులు

మార్కాపురం: రైతులు విత్తనాలు కొనుగోలు చేసినపుడు తప్పనిసరిగా రైతు పేరుపై బిల్లులు ఇవ్వాలని డీలర్లను వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం మండల వ్యవసాయ కార్యాలయంలో డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు విక్రయించాలని స్పష్టం చేశారు. మార్కాపురం ఏఓగా పనిచేస్తూ బదిలీపై పొదిలి మండలానికి వెళ్లిన దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డిని ఏడీఏ బాలాజీ నాయక్‌తో కలిసి జేడీఏ సన్మానించారు. కార్యక్రమంలో ఏఓలు బుజ్జిబాయి, ప్రసన్న రంగలక్ష్మి, జ్యోత్స్నదేవిక, మహమ్మద్, శివగంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవ చేసే అవకాశం అదృష్టం



సన్మాన సభలో మాట్లాడుతున్న అన్నా రాంబాబు

తర్లుపాడు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం గొప్ప విషయమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని గొల్లపల్లిలో పోస్టుమాస్టర్‌గా పని చేస్తూ శుక్రవారం పదవీ విరమణ పొందిన యక్కంటి చెన్నారెడ్డిని ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ.. చెన్నారెడ్డి శేషజీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, సర్పంచ్ రామిరెడ్డి, ఎంపీటీసీ రమేష్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ, వైఎస్సార్ సీపీ పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు రంగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మురారి, పార్టీ నాయకులు గాయం శ్రీనివాసరెడ్డి, శేషయ్య, మేకల జనార్దన్, భాస్కర్‌రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా చిన్న షహాదత్



గార్లదిన్నెలో ఉత్సవ పీర్లు



వెలుగొండ్రాయునిపల్లిలో హోమగుండం

కొనకనమిట్ల: మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని చిన్న షహాదత్ ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ముందుగా హోమగుండం వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. మండలంలోని బచ్చలకూరపాడు, గార్లదిన్నె, వెలుగొండ్రాయునిపల్లి, గరిమినపెంట, పేరారెడ్డిపల్లి, సిద్ధవరం, మునగపాడు, నాగంపల్లి, నాయుడుపేట, చినారికట్ల గ్రామాల్లో పీర్ల చావిళ్లను సుందరంగా ముస్తాబు చేశారు. శని, ఆదివారాల్లో పెద్ద షహాదత్ వైభవంగా నిర్వహించేందుకు ఆయా కమిటీల సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

అన్నీ ఆరుబయటే..!



గొట్లగట్టులో బహిర్భూమికి వెళ్లి వస్తున్న విద్యార్థులు



గొట్లగట్టు బీసీ హాస్టల్లో ఆరుబయటే స్నానం

- సమస్యలతో హాస్టల్ విద్యార్థుల సతమతం

కొనకనమిట్ల: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో పేదింటి పిల్లలు సరైన మౌలిక వసతులు లేక సతమతమవుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ హాస్టళ్లలో చేర్పిస్తే వారి సంక్షేమాన్ని కూటమి సర్కార్ గాలికొదిలేసింది. దీంతో ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని కొనకనమిట్ల, పెదారికట్ల గ్రామాల్లో ఎస్సీ వసతి గృహాలు, గొట్లగట్టులో బీసీ హాస్టల్ ఉంది. ఆయా చోట్ల సుమారు ఎస్సీ, బీసీలకు చెందిన 150 మందికిపైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. గొట్లగట్టు, కొనకనమిట్ల గ్రామాల్లోని వసతి గృహాల్లో సరిపడా మరుగుదొడ్లు, నీటి వసతి లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఉదయాన్నే బహిర్భూమికి వాటర్ బాటిళ్లు తీసుకుని ఊరి బయటకు వెళ్తున్నారు. ఆరుబయటే అందరం ఒకేచోట స్నానాలు చేయాల్సిన పరిస్థితి అని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అద్దె భవనాల్లో హాస్టల్స్ ఉన్నాయి. అక్కడ సరైన వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఇరుకు గదుల్లోనే విద్యార్థులు సర్దుకుపోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హాస్టళ్లలో సరైన వసతులు కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



విద్యార్థులందరికీ ఒకే మరుగుదొడ్డి